నమస్తే తెలంగాణ
మెదక్

I | హైదరాబాద్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | MEDAK



సిద్దిపేటలో ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు

మైనార్టీల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

- ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 31: పదేండ్లలో ముస్లింల అభ్యున్నతి కోసం కేసీఆర్ ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎక్బాల్ మినార్ వద్ద రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రంజాన్ పండుగను హిందూ, ముస్లిం అనే భేదాభిప్రాయాలు లేకుండా చేసుకోవాలని, నిన్న ఉగాది రోజు ముస్లింలు హిందువుల ఇండ్లల్లోకి వచ్చి భక్షాలు తినడంతో పాటు ఉగాది శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈరోజు రంజాన్ పండుగ సందర్భంగా హిందువులు ముస్లింలను అలయ్ బలయ్ చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నారన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి మనదేశంలో, తెలంగాణ రాష్ట్రంలో మతాలకతీతంగా సోదరభావంతో ఒకరి పండుగల్ని ఒకరు గౌరవిస్తూ ఎంతో సఖ్యతతో జీవిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. కొన్ని శక్తులు రెచ్చగొట్టేలా ప్రయత్నం చేస్తున్నప్పటికీ అందరూ ఓపికతో, శాంతితో కలిసిమెలిసి దేశం,రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, భూపేశ్, ఆక్తర్ పటేల్, ఇర్షాద్ హుస్సేన్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేటలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక శివారులో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య, రెవెన్యూ అధికారులు

దుబ్బాక, మార్చి 31: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. దుబ్బాకకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ మంజూరైన సందర్భంగా సోమవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, రెవెన్యూ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ లోని సర్వే నెంబర్ 527లో, దుబ్బాక పట్టణం లో(చీకోడు రోడ్డులో) సర్వే నెంబర్ 1523, 1525ల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. యూనివర్సిటీతోపాటు హాస్టల్ సముదాయానికి సుమారు 50ఎకరాల స్థలం అవసరముంటుందన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గం మూడు ముక్కలుగా మారిందని, భౌగోళికంగా, పాలనాపరంగా చాలా సమస్యలున్నాయన్నారు. అత్యధిక గ్రామాలతో కూడిన నియోజకవర్గంగా, ఇక్కడ కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి ప్రజాజీవనం సాగుతుందన్నారు. అభివృద్ధిలో చాలా వెనుకంజలో ఉందన్నారు. నియోజకవర్గ సమస్యలపై ఇటీవల శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దుబ్బాక అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందులో భాగంగా దుబ్బాకకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ మంజూరు కావడం, హబ్షీపూర్ నుంచి లచ్చపేట వరకు రోడ్డు విస్తరణకు రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మల్లన్నసాగర్ ఉన్నా సాగునీటి సమస్య

తలాపున మల్లన్నసాగర్ ఉన్నప్పటికీ సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతులకు మల్లన్న సాగర్ సాగునీరు సరఫరా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టుల ద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కాల్వల ద్వారా సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. మల్లన్న సాగర్ కాల్వల నిర్మాణ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్‌పై చర్చించినట్లు తెలిపారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో 109 మందికి రూ.26 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కైలాశ్, రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త దారుణ హత్య

- డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యే
- 'ఖేడ్' మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సంఘటనా స్థలాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

హరిసింగ్(ఫైల్)

నారాయణఖేడ్/కల్హేర్, మార్చి 31: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో బీఆర్ఎస్ కార్యకర్త హరిసింగ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్ మండలం కొత్తచెరువు తండాకు చెందిన హరిసింగ్(50) తండాలో సొంత ఇల్లు కూడా లేని స్థితిలో కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. హరిసింగ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా కల్హేర్‌లో పంచాంగ శ్రవణానికి వెళ్లిన హరిసింగ్ తిరిగి ఇంటికి చేరలేదు. సోమవారం ఉదయం నీలంవాగు సమీపంలో శవమై కనిపించాడు. సమాచారమందుకున్న సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. హరిసింగ్ మెడకు టవల్ బిగించి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా జాగిలం మృతదేహం వద్ద నుంచి కొద్ది దూరం వరకు వెళ్లి ఆగిపోయింది. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల నుంచి ఫుటేజీలను సేకరించి వాటి ఆధారంగా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తున్నది. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

హరిసింగ్ హత్య పిరికిపంద చర్య

హరిసింగ్ హత్య పిరికిపంద చర్య అని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. హత్య విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని విలేకరులతో మాట్లాడారు. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనన్నారు. గతంలోనూ సిర్గాపూర్ మండలంలో బీఆర్ఎస్ కార్యకర్తను హత్య చేసిన విషయాన్ని గుర్తు చేసిన మాజీ ఎమ్మెల్యే పోలీసులు నిస్పక్షపాతంగా దర్యాప్తు జరిపి హరిసింగ్ హత్యకు బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

విలపించిన కుటుంబీకులు

హరిసింగ్ హత్యకు గురి కావడంతో అతడి భార్య, పిల్లలతోపాటు బంధువులు విలపించారు. నిరుపేద కుటుంబం కావడంతో అన్ని తానై కుటుంబాన్ని పోషించుకుంటుండగా అతడి హత్య కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హరిసింగ్ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని వారికి భరోసా ఇచ్చారు. హరిసింగ్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టానికి తరలించే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. మృతదేహం తరలింపును చాలాసేపటి వరకు అడ్డుకున్నప్పటికీ ఎస్ఐ వెంకట్‌రెడ్డి వారిని సముదాయించి, హత్య చేసిన వారికి కఠిన శిక్ష పడే విధంగా చూస్తామని భరోసా కల్పించి మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో కూలీలుగా మారి మక్కకంకులు ఏరుతున్న మహిళా నాయకులు

కూలిపనికి వచ్చిన మహిళలకు కృతజ్ఞతలు

వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి మహిళా మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో కూలి పని కోసం తరలిరావడం అభినందనీయం. పార్టీ మీద అభిమానంతో పని చేసిన మహిళలకు కృతజ్ఞతలు. బీఆర్ఎస్ సభ కోసం స్వచ్ఛందంగా ప్రజలు, రైతులు ముందుకురావడం సంతోషంగా ఉంది. రజతోత్సవ సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలి.

– ఎర్పుల అపూర్వ, మహిళా నాయకురాలు

అభిమానంతో పనికి వచ్చినం

కేసీఆర్, బీఆర్ఎస్ అంటే ఎంతో ఇష్టం. వరంగల్‌లో జరిగే సభ కోసం స్వచ్ఛందంగా ఖర్చులకు డబ్బులు సమకూర్చుకునేందుకు కూలి పనికి వచ్చినం. రజతోత్సవ సభతో పాటు కేసీఆర్‌ను చూడడానికే కష్టపడి కూలి పని చేస్తున్నాం. మండలంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలందరూ భారీగా తరలివచ్చారు. బీఆర్ఎస్ పాలనలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారు.

– లింగాల నిర్మల, మాజీ ఎంపీపీ

ఆడబిడ్డలకు శతకోటి వందనాలు

రజతోత్సవ సభకు వెళ్లేందుకు కూలి చేస్తూ డబ్బులు సంపాదిస్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు

మక్కకంకులు ఏరేందుకు వస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు

మక్క కంకులు ఏరుతున్న మహిళా నాయకులు

- సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో బీఆర్ఎస్ మహిళా నేతల వినూత్న కార్యక్రమం
- రైతు బాల్‌రెడ్డి మక్కచేనులో పనిచేసిన బీఆర్ఎస్ మహిళా విభాగం
- కూలి చేసిన మహిళానేతలకు రూ.10 వేలు ఇచ్చిన రైతు
- ఏప్రిల్ 27న జరగనున్న సభకు భారీగా తరలివెళ్లేందుకు సమాయత్తం
- మళ్లీ కేసీఆర్ సారే రావాలంటూ నినదించిన మహిళా నేతలు
- మా బతుకుల్లో ఆనందం నింపిన కేసీఆర్ కోసం మేము సైతం అంటున్న అన్నదాతలు

సిద్దిపేట ప్రతినిధి/ బెజ్జంకి, మార్చి 31 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలి వెళ్లడానికి సబ్బండ వర్గాలు సిద్ధమవుతున్నాయి. ఏప్రిల్ 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు లక్షలాదిగా తరలివెళ్లడానికి ఎవరి తొవ్వ ఖర్చులు వారే సమకూర్చుకుంటున్నారు. వ్యవసాయ పనుల సీజన్ కావడంతో కూలి పనులు చేసి సభకు వెళ్లేందుకు డబ్బులు పోగు చేసుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా మానకొండురు నియోజకవర్గం బెజ్జంకి మండలం లక్ష్మిపూర్‌లో సోమవారం బీఆర్ఎస్ మహిళా నేతలు, మాజీ మహిళా ప్రజాప్రతినిధులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తామంతా స్వచ్ఛందంగా తరలివెళ్లి కేసీఆర్ సభను విజయవంతం చేస్తామంటున్నారు. సభకు అవసరమయ్యే ఖర్చులను తామే సొంతంగా సమకూర్చుకుంటున్నామని చెప్పారు. కేసీఆర్ సార్ లేకుంటే కాళేశ్వరం లేదు... మధ్యమానేరు లేదు...ఇయ్యాల అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా వస్తున్న కాల్వ నీళ్లతో బీడు భూముల్లో సైతం పుట్లకొద్దీ ధాన్యం, మొక్కజొన్నలు పండుతున్నాయి. దీనికి కారణం కేసీఆర్ సార్ తెచ్చిన కాళేశ్వరం నీళ్లతోనే నని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదేండ్లలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కాల్వలు తెచ్చారు. ఇయ్యాల మా బతుకుల్లో ఆనందం ఉందని రైతులు పేర్కొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు నీళ్లు ఇవ్వడానికి కారణమైన కేసీఆర్ సార్ పెట్టబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మేము సైతం తరలివస్తామని రైతులు దండుగా కదులుతున్నారు. ప్రతిరోజూ ఒక గ్రామంలో కూలి పని చేసి వచ్చిన డబ్బులతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా దండు కదలబోతుంది. పని చేసిన డబ్బులతో వాహనాలు, భోజనం, తాగునీటి కోసం వెచ్చించుకుంటామని, మళ్లీ కేసీఆర్ సార్ కావాలంటూ మహిళలు నినదించారు.

చారిత్రాత్మక సభకు వినూత్న కార్యక్రమం

రాష్ట్రంలోనే తొలిసారిగా వినూత్న కార్యక్రమానికి మానకొండూరు నియోజకవర్గం బెజ్జంకి మండల మహిళా నేతలు శ్రీకారం చుట్టారు. కేసీఆర్ మీద ఉన్న అభిమానంతోపాటు తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నవారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాణి రుద్రమాదేవిలాగా పోరాటం చేసిన మహిళా నేతలు ఉన్నారు. వారంతా కూడా ఇవ్వాళ మళ్లీ కేసీఆర్ సార్ రావాలి... రైతుల బాధలు పోవాలి.. అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని మహిళా నేతలు నినదిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దాదాపు 14 ఏండ్ల పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించినవారే ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్ల పాటు వివిధ హోదాల్లో ప్రజాప్రతినిధులుగా చేసిన వారు సైతం కూలీ పని చేసిన వారిలో ఉన్నారు. ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన మహిళా నేతలు ఇవ్వాళ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సిద్ధమవుతూ.. మిగితా వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతిరోజూ కూలి పనులు చేస్తూ తమ మండలంలోని అన్ని గ్రామాల క్యాడర్ తరలివెళ్లడానికి కూలి పనులు చేసి డబ్బులు సమకూర్చుకుంటామంటున్నారు.

ఉక్కుగుండెను ఒక్కసారి చూసిరావాలి

ఉక్కుగుండెను ఒక్కసారి చూసి రావాలని, రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నామని పార్టీ మహిళా నేతలు చెబుతున్నారు. ఆ ఉక్కు గుండెను చూడడానికి మా భర్తల డబ్బులతోనో... మా అత్తమామల డబ్బులతోనో.. మా అన్నలు ఇచ్చే డబ్బులతోనో కాదు..స్వయంగా తాము కూలి పని చేసి వచ్చిన డబ్బులతోనే రజతోత్సవ సభకు వెళ్లి ఆ ఉక్కుగుండె (కేసీఆర్ బాపు)ను చూసి వస్తాం. తామంతా మీ వెంటే అని గట్టిగా చెబుతాం.. మళ్లీ మీరే సీఎం కావాలి... సీఎం అయ్యే వరకు తాము తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం చేస్తామని మహిళా నేతలు గట్టిగా నినదించారు.

రైతు బాల్‌రెడ్డి మక్క చేనులో కూలి పని

బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో రైతు బాల్‌రెడ్డి మక్క చేనులో బీఆర్ఎస్ మహిళా నేతలు, మహిళా ప్రజాప్రతినిధులు కూలి పని చేశారు. మొక్కజొన్న పంటలో మక్కలు ఏరే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చేనులో ఉన్న కంకులను ఏరి సంచుల్లో నింపి ట్రాక్టర్‌లో పోశారు. సుమారుగా వంద మందికి పైగా మహిళా నేతలు కూలి పనిలో పాల్గొన్నారు. దాదాపుగా మూడు గంటలకు పైగా కూలి పని చేశారు. ఇందుకు ప్రతి మహిళకు కూలి ఇచ్చారు. మహిళా నేతలు చేసిన కూలి పనికి రైతు రూ.10వేలు ఇచ్చారు. వీటిని కేసీఆర్ సభకు తరలివెళ్లేందుకు వినియోగించుకుంటామని మహిళా నేతలు చెప్పారు.

ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే తెలంగాణ

ఏప్రిల్ 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లడానికి బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్‌లోని రైతు బాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మొక్కజొన్న కంకులు ఏరుతూ కూలి పనిచేసిన ఆడబిడ్డలకు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ను ముందుండి నడిపి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినది ఆడబిడ్డలేనన్నారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం ఆగంకావొద్దు సారూ మీరుంటేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని పదేండ్లు కేసీఆర్ సార్‌ను దీవించి సీఎం చేసింది ఆడబిడ్డలేనన్నారు. వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం వాహనాలను బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేస్తుందని చెప్పినా ఆడబిడ్డలు తమ సొంత ఖర్చులతోనే వాహనాలు ఏర్పాటు చేసుకొని వస్తామని, కూలి పనిచేసిన ఆడబిడ్డలకు శతకోటి వందనాలన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన పార్టీ గులాబీ పార్టీ... గులాబీ పార్టీ లేకుంటే తెలంగాణ రాష్ట్రం లేదు. ఆడబిడ్డల కండ్లల్లో ఆనందం లేదని, ఆడబిడ్డలే సొంతంగా వాహనాలు పెట్టుకొని వస్తామనడం వారి అభిమానానికి ధన్యవాదాలు. సాగునీళ్లు ఇవ్వడానికి కారణమైన కేసీఆర్ సార్ పెట్టబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మేము సైతం తరలివస్తామని రైతులు కదులుతున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా దండు కదలబోతుందన్నారు. కేసీఆర్ సార్ లేకుంటే కాళేశ్వరం లేదు... మధ్యమానేరు లేదు... ఇయ్యల అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా వస్తున్న కాల్వ నీళ్లతో బీడుభూముల్లో సైతం పుట్లకొద్దీ ధాన్యం, మొక్కజొన్నలు పండుతున్నాయి. దీనికి కారణం కేసీఆర్ సార్ తెచ్చిన కాళేశ్వరం నీళ్లేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏరిన కంకులను ట్రాక్టర్‌లో వేస్తున్న మహిళా నాయకులు

బహిరంగ సభను విజయవంతం చేయాలి

వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు బెజ్జంకి మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలి. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశానుసారం పార్టీ సభ కోసం పనిచేస్తున్నం. సభ ప్రకటించినప్పటి నుంచి ప్రజల్లో మంచి స్పందన ఉంది. సభకు స్వచ్ఛందంగా వస్తామని ప్రజలు ముందుకు వస్తున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. బీఆర్ఎస్ పాలనలో లక్ష్మీపూర్ గ్రామానికి సంపూర్ణంగా సాగునీరు అందింది. ఇప్పుడు సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయి. బీఆర్ఎస్ పాలనే సువర్ణ పాలనగా ప్రజలు భావిస్తున్నారు.

– పాకాల మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, బెజ్జంకి

మండుటెండల్లో మత్తడ్లు దుంకాయి..

బీఆర్ఎస్ హయాంలో మండుటెండల్లో మత్తళ్లు దుంకడంతో పొలాలు ఎండిపోకుండా కాపాడుకున్నం. నేడు సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయి. రైతులు తీవ్రమైన బాధలో ఉన్నారు. రుణమాఫీ కాక, రైతుబంధు రాక, సకాలంలో ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారు. రజతోత్సవ సభ విజయవంతం అవుతుంది.

– బొమ్మకంటి రామలింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు

స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు..

రజతోత్సవ సభకు తమ ఖర్చులను తామే భరించుకొని సభకు వెళ్లాలనే ఉద్దేశంతో ఈరోజు కూలి పనికి వచ్చిన. తొలి సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితోనే నియోజకవర్గం అభివృద్ధిలో ముందువరుసలో ఉంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసి నేడు స్వరాష్ట్ర కలను సిద్ధింపజేసిన పార్టీగా ప్రజలు గుండెల్లో చెరగని ముద్రవేసింది. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంది. నేడు గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలతో సతమతవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

– కనగండ్ల కవిత, మాజీ జడ్పీటీసీ, బెజ్జంకి

కేసీఆర్‌పై అభిమానంతో కూలి పనులకు వచ్చిన యువతులు



కూలి డబ్బులు చూపిస్తున్న మహిళా నాయకులు